సాక్షి ఒడిశా

గురువారం । 19 । జూన్ । 2025



శ్రీమందిరం ఆదాయం లెక్కింపు

భువనేశ్వర్: పూరీ జగన్నాథాలయం హుండీలో భక్తుల కానుకల రూపంలో సమర్పించిన ఆదాయాన్ని పాలకవర్గం బుధవారం లెక్కించారు. ఇందులో నగదు రూ.1,18,081లువచ్చాయని అధికారులు తెలిపారు.



హోటళ్లలో తనిఖీలు

నబరంగ్‌పూర్‌లోని హోటళ్లలో విస్తృతంగా తనిఖీలు జరిగాయి. డయేరియా నేపథ్యంలో తనిఖీలు చేశారు.

- 10లో▸



బహుచరణ్‌మాత ఉత్సవాలు

పర్లాకిమిడిలో బహుచరణ్ మాత ఉత్సవాలు ఘనంగా జరిగాయి. శోభాయాత్ర నిర్వహించారు.

- 10లో▸

న్యూస్‌రీల్

అధ్వానంగా జయపూర్ రోడ్డు



అధ్వానంగా ఉన్న పంచానన్ మందిర్ నుంచి జయనగర్ మార్గం

కొరాపుట్: అవిభక్త కొరాపుట్ జిల్లాల్లోనే అతి పెద్ద పట్టణమైన జయపూర్–జయనగర్ మార్గం మురికి కూపంలా మారింది. పంచానన్ మందిరం నుంచి జగన్నాథ్ సాగర్ మీదుగా జయనగర్ మార్గంలో ప్రయాణం చేయాలంటే ప్రజలు హడలి పోతున్నారు. చిన్నపాటి వర్షం కురిసిన రోడ్డు బురద మయం అవుతున్నది. ఈ ప్రాంతంలో జగన్నాథసాగర్ పూడిక తీత వాహనాలు నిత్యం ప్రయాణం చేస్తుండడంతో ఆ మట్టి రోడ్డుపై పడుతుండడంతో అధ్వానంగా తయారవుతోంది. ఎండఉంటే వాహనాలు వెళ్లడానికి అవకాశం ఉంటుంది. లేదంటే ప్రజలు నరకాన్ని చూస్తున్నారు. ఈ మార్గం కాదనుకుంటే క్రిష్టియన్‌పేట, మెయిన్ రోడ్డు మీదుగా సుమారు ఆరు కిలో మీటర్లు ప్రయాణం చేయాల్సి వస్తుంది. అధికారులు స్పందించి బురదను తొలగించాలని సమస్యను పరిష్కరించాలని ప్రజలు విజ్ఞప్తి చేస్తున్నారు.

వర్షాలకు ట్రాక్టర్‌పై కూలిన భారీ వృక్షం



ట్రాక్టర్ మీద కూలిన వృక్షాన్ని తొలగిస్తున్న అగ్ని మాపక సిబ్బంది

కొరాపుట్: భారీ వర్షాలకు వృక్షం నేలకూలింది. బుధవారం కొరాపుట్ జిల్లా నందపూర్ సమితి సెమలా గ్రామంలో భీమ్ కిర్సాని ట్రాక్టర్ మీద వృక్షం పడింది. ఆ సమయంలో మనుషులు ఎవ్వరూ లేక పోవడంతో ప్రమాదం తప్పింది. భారీ వృక్షం కావడంతో ట్రాక్టర్ దెబ్బతింది. నందపూర్ సమితి కేంద్రం నుంచి అగ్ని మాపక బృందం వచ్చి చెట్టుని తొలగించింది.

చోరీ కేసులో ఆరుగురు అరెస్టు



అరెస్టయిన నిందితులు, స్వాధీనం చేసుకున్న చోరీ సామగ్రి

రాయగడ: జిల్లాలోని కాసీపూర్ సమితి టికిరి పంచాయతీలోని కంసారిగుడలో మైత్రీ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ ప్రయివేట్ లిమిటెడ్ కంపెనీకి చెందిన ఇనుప సామగ్రి చోరీ కేసులో ఆరుగురు నిందితులను టికిరి పోలీసులు అరెస్టు చేశారు. అరెస్టయిన వారిలో సమితిలోని పహండి గ్రామానికి చెందిన బారబార బాగ్, పద్మన్ బాగ్, భీమసేన్ ఒడాది, సుదీప్ బెనియ, అజయ్ ధల్, శేఖ్ అమీరులుగా గుర్తించారు. ఈ మేరకు పోలీసులు కేసు నమోదు చేసి బుధవారం కోర్టుకు తరలించారు. కాంసారి గుడలో మైత్రీ కంపెనీ కర్మాగారం నిర్మాణం పనులను చేపట్టింది. ఇందులో భాగంగా సెంట్రింగ్ ప్లేట్‌లు, ఇనుప రాడ్లు తదితర సామగ్రి దొంగతనానికి గురైంది. దీంతో కంపెనీకి సంబంధించిన పీఆర్వో ఆశీష్ కుమార్ టికిరి పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. కేసు దర్యాప్తులో భాగంగా మంగళవారం నాడు పోలీసులు పెట్రోలింగ్ చేస్తున్న సమయంలో సనోమాటికొన కూడలిలో ఇనుప రాడ్లను బైకులపై తీసుకువెళుతున్న యువకులను పట్టుకున్నారు. వారిని విచారించగా ఇనుప సామగ్రిని తామే దొంగిలించి వేరే వారికి విక్రయిస్తున్నట్లు అంగీకరించారు. దీంతో సామగ్రిని దొంగతనం చేసిన వారితోపాటు కొనుగోలు చేసిన వారిపని కూడా అరెస్టు చేసినట్టు పోలీసులు చెప్పారు.

11 అడుగుల కొండచిలువ పట్టివేత



పామును పట్టుకున్న రాకేష్ హల్దార్

మల్కన్‌గిరి: మల్కన్‌గిరి జిల్లా కలిమెల సమితి ఎంవీపీ 22 గ్రామంలో నివసిస్తున్న తుషార్ కాంత్ అనే వ్యక్తి ఇంటి ఆవరణలో 11 అడుగుల కొండ చిలువ హల్‌చల్‌చేసింది. మంగళవారం రాత్రి 11గంటల సమయంలో పాము కనిపించడంతో కలిమెల స్నేక్‌హెల్ప్ లైన్ రాకేష్ హల్దార్‌కు సమాచారం ఇచ్చారు. ఆయన తన సిబ్బందితో వచ్చి పామును పట్టుకున్నారు. ఉదయం అడవిలో విడిచిపెట్టారు.

సీఎం నివాసం ముట్టడికి..

కాంగ్రెస్ విఫలయత్నం



నగరంలో కాంగ్రెస్ నిరసన ప్రదర్శన



ముఖ్యమంత్రి నివాసం ముట్టడి కోసం బైఠాయించిన కాంగ్రెస్ నాయకులు

భువనేశ్వర్: రాష్ట్రంలో మహిళలపై సామూహిక అత్యాచారం, హత్య సంఘటనలు పెచ్చు మీరుతున్నాయి. పరిస్థితి ఆందోళనకరంగా పరిణమిస్తోంది. రాష్ట్రంలో మహిళలకు పూర్తిగా రక్షణ కొరవడింది. డబుల్ ఇంజిన్ భారతీయ జనతా పార్టీ ప్రభుత్వం ఏడాది పాలన పూర్తి వార్షికోత్సవంలో తలమునకలై ఉంది. రాష్ట్రంలో ప్రతి రోజూ 15 మందికి పైగా మహిళలు, మైనరు బాలికలు సామూహిక అత్యాచారానికి గురవుతున్నారు. రాష్ట్రంలో 64,000 మందికి పైగా మహిళలు మరియు పిల్లలు తప్పిపోయిన పరిస్థితుల్లో రాష్ట్ర ప్రభుత్వ తొలి వార్షికోత్సవాన్ని జరుపుకోవడానికి ప్రధాన మంత్రి విచ్చేస్తున్నారు. ముఖ్యమంత్రి సొంత జిల్లా కెంజొహర్ ప్రాంతం హరిచందన్‌పూర్‌లో మహిళపై సామూహిక అత్యాచారం చేసి చెట్టుకు వేలాడదీశారు. మరెన్నో ఇలాంటి సిగ్గు చేటు అకృత్యాలు నిత్య కృత్యాలుగా పరిణమిస్తున్నా ముఖ్యమంత్రి, ప్రధాన మంత్రి ఈ దిగ్భ్రాంతికరమైన సంఘటనల పట్ల చీమ కుట్టినట్లు అయిన స్పందించక పోవడం విచారకరమని రాష్ట్ర కాంగ్రెసు వ్యవహారాల ఇంచార్జి అజయ్ కుమార్ లల్లూ ఆరోపించారు. రాష్ట్రంలో మహిళలపై నేరాలు అన్ని జాతీయ రికార్డులను బద్దలు కొట్టిన ఏకైక రాష్ట్రం ఒడిశా అని ఆయన వ్యాఖ్యానించారు. గంజాం జిల్లా గోపాల్‌పూర్, కెంజొహర్ జిల్లా హరిచందన్‌పూర్, కటక్ జిల్లా బరాంగ్ మరియు అంగుల్ జిల్లా కనిహా మండలంలో జరిగిన భయంకరమైన మూక హత్యలకు నిరసనగా రాష్ట్ర కాంగ్రెస్ అధ్యక్షుడు భక్త చరణ్ దాస్ ఆధ్వర్యంలో ప్రదేశ్ కాంగ్రెస్ కమిటీ బుధవారం భారీ ఆందోళన చేపట్టింది. ఈ సందర్భంగా ముఖ్యమంత్రి నివాసాన్ని ముట్టడించేందుకు నిరసనకారులు విఫలయత్నం చేశారు.

రాష్ట్రంలో మహిళలపై దారుణాలు పెరుగుతున్నందున ముఖ్యమంత్రి రాజీనామా చేయకుండా సంబరాలు చేసుకోవడం విచారకరమని రాష్ట్ర కాంగ్రెసు వ్యవహారాల ఇంచార్జి విమర్శించారు. మహిళలపై దారుణాలకు వ్యతిరేకంగా కాంగ్రెస్ నిరవధికంగా పోరాడుతుందని ఎమ్మెల్యే తారా ప్రసాద్ బహినీపతి అన్నారు. భారతీయ జనతా పార్టీ మహిళలను ఆట బొమ్మలుగా భావిస్తుంది. కాంగ్రెస్ పార్టీ అసెంబ్లీలో ఈ అంశాన్ని మళ్లీ లేవనెత్తుతుందని అన్నారు. వేలాది మంది కాంగ్రెస్ కార్యకర్తలు, నాయకులు కాంగ్రెస్ భవన్ నుంచి బయల్దేరి ప్రభుత్వ వ్యతిరేక నినాదాలు చేస్తూ ముఖ్యమంత్రి నివాసం ముట్టడించేందుకు బారికేడ్లను బద్దలు కొట్టి ఊరేగింపుగా వెళ్లారు. ఈ సందర్భంగా పోలీసులతో ఘర్షణ చోటు చేసుకుంది. ముఖ్యమంత్రి రాజీనామా చేయాలని నినాదాలు చేస్తూ ఆందోళనకు సారథ్యం వహించిన ముందంజ నాయకుల్ని పోలీసులు బలవంతంగా తొలగించారని ఆరోపించారు. కాంగ్రెస్ శాసనసభా పక్ష నాయకుడు రామ చంద్ర కదమ్, ఎమ్మెల్యేలు అశోక్ దాస్, సోఫియా ఫిరదౌసి, మహిళా కాంగ్రెసు నాయకురాలు మీనాక్షి బాహినీపతి, ఇతర నాయకులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో ఘెరావ్ కార్యక్రమంలో పాల్గొన్నారు.

వంశీకృష్ణ హోటల్ యజమానికి జరిమానా



వ్యర్థాలు పారబోసిన ప్రాంతం



జరిమానా విధించిన రశీదు

రాయగడ: స్థానిక వంశీకృష్ణ హోటల్ యజమానికి మున్సిపాలిటీ అధికారులు రూ.10వేలు జరిమానా విధించారు. హోటల్‌కు సంబంధించి వినియోగించిన వ్యర్థాలను జనావాసాల్లో పారబోస్తున్నారని ఫిర్యాదులు రావడంతో ఈ మేరకు ఈ చర్యలు చేపట్టారు. స్థానిక ఫ్లైఓవర్ బ్రిడ్జి కింద వంశీకృష్ణ హోటల్‌లో వినియోగించే వ్యర్థాలను పారబోస్తుండడంతో ఆ ప్రాంత వాసులు మున్సిపాలిటీకి ఫిర్యాదు చేశారు. దీంతో మంగళవారం నాడు మున్సిపాలిటీ శానిటేషన్ ఇన్‌స్పెక్టర్ వెంకటరావుతో కలిసి మున్సిపాలిటీ సిబ్బంది ఆ ప్రాంతాన్ని పరిశీలించారు. అనంతరం వివరాలు సేకరించిన మీదట హోటల్ యజమాని నిర్లక్ష్యానికి పదివేల రూపాయల జరిమానా విధించారు.

రత్న భాండాగారం పనులు పూర్తి చేయాలి: సీఏఓ

భువనేశ్వర్: పూరీ శ్రీ జగన్నాథుని రత్న భాండాగారం నిర్వహణ, సంరక్షణ పనులు మందకొడిగా సాగుతున్నాయి. ఈ మేరకు సర్వత్రా విమర్శలు వినిపిస్తున్నాయి. అరకొరగా మిగిలిన రత్న భాండాగారం పనులను త్వరగా పూర్తి చేయాలని భారత పురావస్తు శాఖ డైరెక్టర్ జనరల్‌కు శ్రీ మందిరం ప్రధాన నిర్వాహకుడు (సీఏఓ) డాక్టర్ అరవింద్ కుమార్ పాఢి లేఖ రాశారు. రత్న భాండాగారం మరమ్మతు, పరిరక్షణ పనులను వేగవంతం చేయాలని లేఖలో పేర్కొన్నారు. ఈ పనుల్ని ప్రస్తుత రథ యాత్ర సమయంలో పూర్తి చేయాలని, రథ యాత్ర పురస్కరించుకుని ఈ నెల 28 నుంచి జూలై నెల 6 వరకు శ్రీ మందిరంలో పనులు నిరవధికంగా చేపట్టేందుకు అనుకూలమైన సమయంగా వివరించారు. ఈ వ్యవధిలో ఆలయ రత్న భాండాగారం ప్రాముఖ్యతను దృష్టిలో ఉంచుకుని అన్ని పనులు పూర్తి చేయాలని భారత పురావస్తు శాఖకు స్పష్టం చేశారు. ఈ పనుల్ని ప్రాధాన్యతా క్రమంలో చేపట్టాలని కోరారు. రథ యాత్ర సమయంలో నిర్వహించే వార్షిక గర్భ గృహ నిర్వహణ, ఇతర ముఖ్యమైన పరిరక్షణ పనులను భారత పురావస్తు శాఖ పర్యవేక్షిస్తుంది. ఈ పనుల పర్యవేక్షణ కోసం డిప్యూటీ డైరెక్టర్ లేదా డైరెక్టర్ హోదాలో ఉన్న అధికారిని నియమించాలని శ్రీ మందిరం ప్రముఖ నిర్వాహకుడు తెలిపారు. శ్రీ మందిరం దీర్ఘకాలిక సంరక్షణ మరియు నిర్మాణ రక్షణ కోసం ఏఎస్ఐ సహకరించి పనుల ప్రాముఖ్యతను దృష్టిలో ఉంచుకుని, అభ్యర్థించిన అన్ని పనులను నిర్ణీత సమయ వ్యవధిలో పూర్తి చేయాలని లేఖలో పేర్కొన్నారు.

ప్రధాని మోదీ పర్యటన రేపు



మనోజ్ ఆహుజా అధ్యక్షతన ఉన్నత స్థాయి సమావేశం



రాష్ట్ర న్యాయ శాఖ మంత్రి ప్రత్యక్ష పర్యవేక్షణలో జనతా మైదానంలో ప్రధాన మంత్రి సభా వేదిక ఏర్పాట్లు

భువనేశ్వర్: భారత ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ ఒక రోజు రాష్ట్ర పర్యటనకు విచ్చేయనున్నారు. ప్రధాని పర్యటన పురస్కరించుకుని భారీ సన్నాహాలు చేస్తున్నారు. స్థానిక లోక్ సేవా భవన్‌లో ప్రభుత్వ ప్రముఖ కార్యదర్శి మనోజ్ ఆహుజా అధ్యక్షతన రాష్ట్ర స్థాయి సన్నాహక సమావేశం నిర్వహించారు. ప్రధాన మంత్రి ఈ నెల 20న మధ్యాహ్నం 2.05 గంటలకు ఉత్తర ప్రదేశ్‌లోని కుషినగర్ అంతర్జాతీయ విమానాశ్రయం నుంచి ప్రత్యేక వైమానిక దళ విమానంలో బయల్దేరి మధ్యాహ్నం 3.40 గంటలకు స్థానిక బిజూ పట్నాయక్ అంతర్జాతీయ విమానాశ్రయానికి చేరుతారు. అక్కడి నుంచి ప్రధాన మంత్రి నేరుగా సాయంత్రం 4.15 గంటలకు బయల్దేరి జనతా మైదాన్‌కు చేరుకుంటారు. అగ్నిమాపక సేవల శాఖ ఏర్పాట్లు, పత్రికా సమన్వయం, డిప్యూటీ కమిషనర్ ఆఫ్ పోలీస్ ద్వారా ఆకస్మిక ప్రణాళిక, ఆరోగ్యం, వైద్య సౌకర్యాలు, రోడ్డు నిర్వహణ, పారిశుద్ధ్యం, అసెంబ్లీ ప్లాట్‌ఫారం సెటప్, పాస్ జారీ, మీడియా ప్రచారం , వేదికల వద్ద ఇంటర్నెట్ కనెక్టివిటీ వంటి అంశాలపై తదుపరి చర్చలు జరిగాయి. ఈ కార్యకలాపాలను పర్యవేక్షించడానికి హోం శాఖ అదనపు కార్యదర్శి (ప్రోటోకాల్) పర్యవేక్షణలో ఒక కంట్రోల్ రూమ్ ఏర్పాటు చేస్తారు. ప్రధాన మంత్రిని స్వాగతించడానికి స్థానిక విమానాశ్రయం, రాజ్ భవన్, కళింగ స్టేడియం, జయదేవ్ విహార్, జనతా మైదాన్ వంటి కీలక ప్రదేశాలలో సాంస్కృతిక కార్యక్రమాల నిర్వహణకు సన్నాహాలు చురుగ్గా సాగుతున్నాయి. జనతా మైదాన్‌లో సభకు భారీ సంఖ్యలో జనసమూహం వచ్చే అవకాశం ఉన్నందున రద్దీ నిర్వహణ, అనుబంధ కార్యకలాపాలను క్రమబద్ధంగా నిర్వహించేందుకు పకడ్బందీ ప్రణాళికను ఖరారు చేశారు. స్థానిక జనతా మైదాన్ బహిరంగ స్థలంలో ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ ప్రజల్ని ఉద్దేశించి ప్రసంగించనున్నారు. ఈ ప్రాంగణంలో భారీ ఏర్పాట్లు చేస్తున్నారు. రాష్ట్ర న్యాయ శాఖ మంత్రి పృథ్వీరాజ్ హరిచందన్ ఈ పనుల్ని ప్రత్యక్షంగా పర్యవేక్షిస్తున్నారు.

విపత్తులు ఎదుర్కొనేలా మాక్‌డ్రిల్



ప్రకృతి వైపరీత్యాలు ఎదుర్కొనేందుకు జిల్లా స్థాయి కార్యాచరణ సమావేశంలో పాల్గొన్న ప్రభుత్వ అధికారులు

పర్లాకిమిడి: స్థానిక కలెక్టరేట్ సమావేశ మందిరంలో ప్రకృతి వైపరీత్యాలను ఎదుర్కోవడానికి జిల్లా స్థాయి టేబుల్ టాప్ అభ్యాసం, మాక్‌డ్రిల్‌ను బుధవారం ఏడీఎం, ఫాల్గుణీ మఝి ఆధ్వర్యంలో నిర్వహించారు. సమావేశానికి రాష్ట్ర డిజాస్టర్ మేనేజ్‌మెంట్ ప్రాజెక్టు కోఆర్డినేటరు సుభోధ్ నాయక్, సబ్ కలెక్టర్ అనుప్ పండా, జిల్లా ఎమర్జెన్సీ అధికారి జగన్నాథ్ పాఢి, ప్రజా ఆరోగ్యశాఖ అసిస్టెంటు ఇంజినీరు బిష్ణుప్రసాద్ అగర్వాల్, అసిస్టెంటు సెక్షన్ ఆఫీసర్ (ఫైర్) అమితాబ్ రాజీలు తదితరులు పాల్గొన్నారు. జిల్లాలో విపత్కర సమయాల్లో ప్రకృతి వైపరీత్యాలు సంభవించినప్పుడు వాటిని ఎదుర్కోవడానికి అధికారులు సిద్ధంగా ఉండాలని ఏడీఎం మఝి అన్నారు. ప్రకృతి వైపరీత్యాలు సంభవించినప్పుడు లైన్ డిపార్ట్‌మెంట్ అధికారులు ఒక బృందంగా ఏర్పడి సమన్వయంతో పని చేయాలని అన్నారు. ఈ సందర్భంగా బరంపురం నుంచి వచ్చిన ఓడ్రాఫ్ సిబ్బంది, జిల్లా అగ్నిమాపక దళం మాక్ డ్రిల్ నిర్వహించారు. తుఫాను, వరదలు వచ్చినప్పుడు రోడ్డుకు అడ్డంగా పడి ఉన్న చెట్లు తొలగించడానికి కట్టర్లు, అస్కా విద్యుత్ లాంతర్లు, అగ్నిప్రమాదాలు సంభవించినప్పుడు ఆక్సిజన్ సిలిండర్లు, జనరేటర్లు ఉపయోగించి ప్రజల ప్రాణాలు ఎలా కాపాడాలో అగ్నిమాపక దళం మ్యాక్ డ్రిల్ చేశారు.



ప్రకృతి వైపరీత్యాల సమయంలో పైభవనాలు ఎక్కడానికి లిఫ్ట్ వంటి యంత్రం



ఓడ్రాఫ్ సిబ్బంది టేబుల్ టాప్ ఎక్సర్‌సైజ్‌ను చూస్తున్న అధికారులు



ప్రాణాంతక సమయంలో వాడే ఆక్సిజన్ సిలెండర్లు



ప్రకృతి వైపరీత్యాల సమయంలో వాడే వివిధ యంత్రాలు, అస్కా లైట్లు

22 నుంచి సామూహిక సెలవులు



నల్ల బ్యాడ్జీలు ధరించి ఆందోళన చేస్తున్న అటవీ విభాగ సిబ్బంది

జయపురం: అటవీ విభాగ నాన్ గెజిటెడ్ ఉద్యోగులు తమ డిమాండ్ల సాధనకు ఆందోళన బాట పట్టారు. మంగళవారం నుంచి నల్ల బ్యాడ్జీలు ధరించి విధులకు హాజరవుతున్నారు. తమ డిమాండ్లు ఆమోదించకపోతే ఆందోళన తీవ్రం చేస్తామని అటవీ విభాగ జయపురం జోనల్ సంఘ కార్యదర్శి గౌతమ స్వైయ్ హెచ్చరించారు. ఈ సందర్భంగా గౌతమ స్వైయ్ మాట్లాడుతూ గత మే నెల 24 వ తేదీన డెంకానల్ అటవీ డివిజన్‌లో ప్రహ్లాద్ ప్రధాన్ పెట్రోలింగ్ చేస్తున్నారని, ఆ సమయంలో వేటగాళ్ల తూటాలకు గురై అతడు మరణించాడని వెల్లడించారు. ప్రహ్లాద్ ప్రధాన్ కుటుంబానికి ఒక కోటి రూపాయలు ఆర్థిక సాయం అందజేయాలని డిమాండ్ చేస్తున్నట్లు వెల్లడించారు. నాన్‌గెజిటెడ్ అటవీ ఉద్యోగుల సమస్యల పరిష్కరించేందుకు అటవీ ఆయుక్త ఏర్పాటు చేయాలని, పోలీసులకు వలే అటవీ విభాగ సిబ్బందికి బీమా సౌకర్యం కలిగించాలని తాము ఎంతో కాలం నుంచి డిమాండ్ చేస్తున్నామని, అయితే ప్రభుత్వం నిమ్మకు నీరెత్తినట్లు వ్యవహరిస్తోందని తెలిపారు. ఈ నెల 22వ తేదీ ఉద్యోగులు అందరూ సామూహిక సెలవు పెట్టి అటవీ డివిజన్ కార్యాలయం ముంగిట ధర్నాలు చేస్తామన్నారు.

తెంతులకుంటి సమితిలో ఎమ్మెల్యే పర్యటన



తెంతులకుంటిలో బీజేపీ విజయోత్సవ ర్యాలీ



బీజేపీలో చేరిన చైర్మన్ నీలాద్రి నాయక్‌కు మిఠాయి తినిపిస్తున్న ఎమ్మెల్యే గౌరీ శంకర్ మజ్జి

కొరాపుట్: నబరంగ్‌పూర్ జిల్లా తెంతులకుంటి సమితిలో బీజేపీ ఎమ్మెల్యే గౌరీ శంకర్ మజ్జి తొలిసారిగా బుధవారం పర్యటించారు. ఈ సందర్భంగా తన అనుచరులతో కలిసి తెంతుల కుంటి సమితి కేంద్రాన్ని సందర్శించారు. బీజేపీ కార్యాకర్తలు మేళతాళాలతో ఎమ్మెల్యేకి స్వాగతం పలికారు. బీజేడీ పార్టీకి కంచుకోటగా ఉన్న ఈ సమితి గత ఎన్నికల్లో బీజేపీకి చిక్కింది. బీజేడీ కి చెందిన సమితి చైర్మన్ నీలాద్రి నాయక్ అవిశ్వాస తీర్మానంతో దించాలని సొంత పార్టీ నిర్ణయించింది. దీంతో ఆమె బీజేపీని ఆశ్రయించింది. కేవలం బీజేపీ ఆ సమితిలో ముగ్గురు సమితి సభ్యులు మాత్రమే ఉన్నారు. అయినప్పటికీ బీజేపీ లౌక్యంతో మరికొందరు మద్దతు పలికారు. తద్వారా అవిశ్వాస తీర్మానానికి సరిపడా కోరం లేక వీగిపోయింది. చివరకు చైర్మన్ నీలాద్రి మజ్జి బయటపడ్డారు. ఈ నేపథ్యంలో బీజేపీ నాయకులు ఎమ్మెల్యే తెంతుల కుంటి సమితికి ఆహ్వానించి విజయోత్సవం నిర్వహించారు. కార్యక్రమంలో పార్టీ జిల్లా అధ్యక్షుడు కుంజ దాస్, సీనియర్ నాయకులు కను దాస్, దేవదాస్ మహాంకుడో పాల్గొన్నారు.

క్లుప్తంగా

క్రికెట్ టోర్నమెంట్ ప్రారంభం



హాజరైన క్రీడాకారులు

జయపురం: జయపురం సమితి పంపుణీ గ్రామ పంచాయతీలో లిజెండ్ 2025 లీగ్ క్రికెట్ టోర్నమెంట్ బుధవారం ప్రారంభమైంది. ముఖ్యఅతిథిగా సీనియర్ క్రీడాకారుడు నిరాకర రౌత్ పాల్గొని పోటీలను ప్రారంభించారు. ఇలాంటి టోర్నమెంట్లు గ్రామీణ ప్రాంతంలో ఔత్సాహిక యువ క్రీడా కారులకు స్ఫూర్తినిస్తుందన్నారు. ప్రారంభంలో మొదటి మ్యాచ్ పంపుణీ రోయల్ చాలెంజేస్, లిజెండ్ పంపుణీ-11 జట్ల మధ్య జరిగింది. టాస్ గెలిచి బ్యాటింగ్ ప్రారంభించిన పంపుణీ రోయల్ చాలెంజేస్ టీమ్ నిర్ణీత 15 ఓవర్లలో 140 పరుగులు చేసింది. 141 పరుగుల లక్ష్యంతో బ్యాంటింగ్ ప్రారంభించిన పంపుణీ లిజెండ్-11 టీమ్ గెలవాలన్న పట్టుదలతో ఆడి 10.5 ఓవర్లలో తన విజయ లక్ష్యం 141 పరుగులు చేసి పంపుణీ రోయల్ చాలెంజేస్ టీమ్‌ను ఓడించింది. లీగ్ క్రికెట్ టోర్నమెంట్ ప్రారంభోత్సవంలో లీగ్ క్రికెట్ టోర్నమెంట్ నిర్వాహకులు సుధీర్ రౌత్, సింహాచళ ప్రధాన్, రఘునాథ్ బెహర పాల్గొన్నారు.

రెగ్యులర్ బీడీవో లేక ఇబ్బందులు



బీడీవో కార్యాలయానికి వచ్చి అధికారి లేక పోవంతో నిరాశతో వెళ్లిపోతున్న ప్రజలు

జయపురం: జయపురం సబ్‌డివిజన్ బొయిపరిగుడ సమితిలో రెగ్యులర్ బీడీవో లేక ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. బుధవారం కొంతమంది యువకులు బొయిపరిగుడ సమితి కార్యాలయానికి వచ్చి బీడీవో కార్యాలయంలో లేక పోవటంతో పనులు జరగ నిరాశతో వెనుదిరిగారు. ఈ సందర్భంగా వారు పత్రికల వారితో మాట్లాడుతూ.. తాము తమ పనుల కోసం ఎన్ని పర్యాయాలు వచ్చినా బీడీవో లేక పనులు జరగడం లేదని వాపోయారు. బొయిపరిగుడ బీడీవో అభిమణ్యు కవి శతపతి గత మే నెల 31వ తేదీన రిటైర్ అయ్యారని.. ఆ తరువాత బీడీవోను నియమించకపోవడంతో తమకు ఇబ్బందులు వచ్చాన్నారు. ప్రభుత్వం పర్మినెంట్ బీడీవోను నియమించకుడా జయపురం సమితి బీడీవో శక్తి మహాపాత్రోకు అప్పగించినట్టు వెల్లడించారు. రెండు సమితిల బాధ్యతలు చేపట్టిన శక్తి మహాపాత్రో బొయిపరిగుడ సమితికి ఎప్పుడు వస్తారో తెలియటం లేదన్నారు. దీంతో సమితిలోని 20 గ్రామ పంచాయతీల ప్రజలు పలు పనులపై బొయిపరిగుడ వస్తూ అధికారి లేక పోవటంతో నిరాశతో వెనుతిరుగుతున్నట్టు చెప్పారు. సుమారు 80, 90 కిలోమీటర్ల దూరంలోని గ్రామాల నుంచి వస్తున్నప్పటికీ బీడీవో లేకపోవడంతో అవస్థలు పడుతున్నట్టు పేర్కొన్నారు. అధికారులు స్పందించి రెగ్యులర్ బీడీవోను నియమించి సమస్యను పరిష్కరించాలని కోరారు.

అనుమానాస్పద స్థితిలో యువకుడి మృతదేహం



నబరంగ్‌పూర్ మార్కెట్ సమీపంలో గుర్తు తెలియని యువకుని మృతదేహం

కొరాపుట్: అనుమానాస్పద స్థితిలో యువకుని మృతదేహం లభ్యమైంది. బుధవారం ఉదయం నబరంగ్‌పూర్ జిల్లా కేంద్రంలోని బస్టాండ్ సమీపంలో కొత్త మార్కెట్ (రైతు బజార్) వెనుక వైపు కన్యకా పరమేశ్వరి దేవాలయం మార్గంలో పార్క్ గోడకి అనుకుని ఉన్న చిన్న సందులో యువకుడి (30) మృతదేహాన్ని స్థానికులు గుర్తించారు. ఇదే సందులో చివరి భాగాన ఒక అనుమానాస్పద బ్యాగ్ పడి ఉంది. హత్య చేసి ఉంటారని స్థానికులు అనుమానిస్తున్నారు. జిల్లా కేంద్ర పోలీసులు సంఘటన స్థలానికి చేరుకొని దర్యాప్తు ప్రారంభించారు.

రంగవల్లి తివాచీ



శ్రీ మందిరం సింహ ద్వారం ముంగిట రంగవల్లి తివాచీ

భువనేశ్వర్: పూరీ శ్రీ మందిరం సింహ ద్వారం ముంగిట కనులు మిరమిట్లు గొలిపే భారీ రంగవల్లి తివాచీ తీర్చిదిద్దారు. రథ యాత్ర కోసం శ్రీ మందిరం నుంచి విచ్చేయనున్న జగతి నాథునికి స్వాగతం పలికేందుకు ప్రతిభావంతులైన కళాకారులు ఉత్సాహంతో దీన్ని రూపొందించారు. కళాకారులను శ్రీ మందిరం ప్రధాన పాలన అధికారి సీఏఓ డాక్టర్ అరవింద కుమార్ పాఢి ప్రత్యేకంగా అభినందించారు.



కళాకారులను అభినందించిన శ్రీ మందిరం సీఏఓ డాక్టర్ అరవింద కుమార్ పాఢి

అటవీ భూములపై అధికారాలు సాధిస్తాం



సమైక్యంగా పోరాటం కొనసాగిస్తామని సంప్రదాయ ఆయుధాలతో నిరసన తెలుపుతున్న ఆదివాసీలు



తొలొసికబడి సమీపంలోని అటవీ భూముల వద్ద ఎర్రజెండాలు పాతుతున్న ఆదివాసీలు

రాయగడ: ఏళ్ల తరబడి ఆదివాసీలు అడవి తల్లిని నమ్ముకుని జీవనాన్ని కొనసాగిస్తున్నారు. అడవుల్లో లభించే అటవీ ఉత్పత్తులే వీరి జీవనాధారం. ప్రభుత్వాలు మారినా ఆదివాసీల తలరాతలు మారడం లేదు. అడవుల్లో ఉన్న ఆదివాసీలకు అటవీ భూమి పట్టాలు ఇవ్వడం లేదు. దీంతో ప్రభుత్వ ప్రయోజనాలను పొందలేక కష్టాలు పడుతున్నారు. అటవీ ప్రాంతాల్లో గల భూములను సాధించుకుని తీరుతామని సీపీఐ (ఎంఎల్) మద్దతుతో ఆదివాసీ సంఘర్ష్ మోర్చ (ఎఎస్ఎం) నాయకులు అన్నారు. బుధవారం జిల్లాలోని కొలనార సమితి పరిధిలో గల జెరెడీ గ్రామ పంచాయతీలోని తొలొసికబడి గ్రామ సమీపంలో గల అడవుల్లో ఎర్రజెండాలను పాతిపెట్టారు. భూమిని ఆక్రమించుకున్నట్లు ప్రకటించారు. ఆదివాసీల హక్కులను కాలరాస్తున్న ప్రభుత్వ తీరును ఎత్తి చూపుతూ ఆదివాసీలంతా కలిసి వారి సంప్రదాయ ఆయుధాలను పట్టుకుని అటవీ భూముల్లో ఎర్రజెండాలను పాతిపెట్టారు. ఈ గ్రామంలో ప్రారంభమైన ఈ పోరాటం జిల్లా వ్యాప్తంగా కొనసాగుతుందని హెచ్చరించారు. ఈ నెల 6వ తేదీన అటవీ భూములను ఆదివాసీలకు అప్పగించి వారి పేరిట పట్టాలు పంపిణీ చేయాల్సిందిగా ఆదివాసీ సంఘర్ష మోర్చా ఆందోళన చేపట్టింది. ఈ మేరకు కొలనార తహసీల్దార్ కార్యాలయాన్ని ముట్టడించిన విషయం తెలిసిందే. అధికారుల నుంచి ఎటువంటి ప్రతిస్పందన లేకపోవడంతో అటవీ భూముల్లో ఆదివాసీలు హక్కు సాధించుకుంటారని, ఈ పోరాటం కొనసాగుతోందని సీపీఐ (ఎంఎల్), ఆదివాసీ సంఘర్ష మోర్చా ప్రతినిధులు పేర్కొన్నారు.

ఘనంగా బహు చరణ్‌మాత మహోత్సవాలు



బహుచరణ్ మాతా



శోభాయాత్ర రథం



హిజ్రాలకు చీరలు, కట్నం అందిస్తున్న తోటి హిజ్రా



శోభాయాత్రలో పాల్గొన్న హిజ్రాలు

పర్లాకిమిడి: పట్టణంలో హిజ్రాల ఆరాధ్యదైవం బహు చరణ్‌మాత మహోత్సవాలు బుధవారం ఘనంగా నిర్వహించారు. ఈ యాత్ర పట్టణ శివార్లలోరి బిజూ కల్యాణ మండపం వరకు సాగింది. భువనేశ్వర్, విశాఖపట్నం, రాయగడ, తదితర పట్టణాల నుంచి విచ్చేసిన హిజ్రాలు బిజూ కల్యాణ మండపం వద్ద బహుచరణ్ మాత, దుర్గాదేవికి పూజలు నిర్వహించారు. అనంతరం బహుచరణ్ మాత కళలోకి వచ్చిన హిజ్రాతో మిగిలిన హిజ్రాలకు చీరలు, కట్నాలు, పసుపు, కుంకుమలు అందజేశారు. ఈ కార్యక్రమానికి జిల్లా కలెక్టర్ బిజయ కుమార్ దాస్, జిల్లా పరిషత్తు, ముఖ్యకార్య నిర్వాహణ అధికారి శంకర్ కెరకెటా, జిల్లా సామాజిక భద్రతాధికారులు హాజరయ్యారు. గజపతి జిల్లా ట్రాన్స్ జెండర్స్ సంఘం అధ్యక్షురాలు మధు బోరాడా, జాస్మిన్ షేక్, తదితరులు పాల్గొన్నారు.

జంట నగరాల్లో పాఠశాలలకు సెలవు

భువనేశ్వర్: భారత ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ రాష్ట్ర పర్యటన పురస్కరించుకుని జంట నగరాలు భువనేశ్వర్, కటక్ మహానగరం పరిధిలోని అన్ని ప్రభుత్వ, ప్రభుత్వ సహాయక, ప్రైవేట్ పాఠశాలలకు సెలవు ప్రకటించారు. ఈ నెల 20 శుక్రవారం ప్రభుత్వం ఏర్పడి ఒక సంవత్సరం పూర్తయిన సందర్భంగా భువనేశ్వర్‌లో రాష్ట్ర స్థాయి సమావేశం నిర్వహిస్తున్నారు. ప్రధానమంత్రి ఈ కార్యక్రమానికి హాజరు కానున్నారు. పెద్ద సంఖ్యలో ప్రజలు గుమిగూడే అవకాశం ఉన్నందున, ట్రాఫిక్ రద్దీ అధికంగా ఉంటుంది. ఈ పరిస్థితుల దృష్ట్యా పాఠశాలలకు ప్రభుత్వం సెలవు ప్రకటించింది.

సామూహిక అత్యాచారంపై ఎంపీ మండిపాటు



మీడియా తో మాట్లాడుతున్న కొరాపుట్ ఎంపీ సప్తగిరి ఉల్కా

కొరాపుట్: బ్రహ్మపుర సమీపంలోని గోపాల్ పూర్ సీ బీచ్‌లో సామూహిక అత్యాచారంపై కాంగ్రెస్ పార్టీకి చెందిన కొరాపుట్ ఎంపీ సప్తగిరి ఉల్కా మండిపడ్డారు. ఏడాది కాలంలో ఎన్నో విజయాలు సాధించామని చెబుతున్న అధికార బీజేపీ సాధించిందేమిటో అర్థం అవుతుందన్నారు. ఇలాంటి దారుణమైన సంఘటనకి బాధ్యత వహిస్తూ ముఖ్యమంత్రి రాజీనామా చేయాలన్నారు. ఏడాది విజయాలు జరుపుకోవడానికి రాష్ట్రానికి వస్తున్న ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ ఈ ఘటనపై ప్రకటన చేయాలన్నారు. ఏడాది కాలంలో రాష్ట్రంలో మహిళలకు రక్షణ లేకుండా పోయిందన్నారు. దీనిపై తాను పార్లమెంట్‌లో కూడా ప్రశ్నలు లేవనెత్తానన్నారు.

విపక్ష నేత నవీన్ పట్నాయక్‌కు అనారోగ్యం

భువనేశ్వర్: రాష్ట్రంలో విపక్ష నేత, బిజూ జనతా దళ్ అధ్యక్షుడు నవీన్ పట్నాయక్ అనారోగ్యంతో బాధపడుతున్నారు. వైద్య నిపుణుల సలహా మేరకు ఆయన ఈ నెల 22న ముంబైలోని కోకిలాబెన్ ధీరూభాయ్ అంబానీ ఆస్పత్రిలో గర్భాశయ ఆర్థరైటిస్ చికిత్స చేయించుకుంటున్నట్లు తెలిపారు. విపక్ష నేత వ్యక్తిగత వైద్యుడు డాక్టర్ రమాకాంత్ పండా ముంబైలో అనుబంధ కార్యకలాపాలు సమన్వయం చేస్తున్నారు. జగన్నాథ స్వామి ఆశీస్సులు, రాష్ట్రంలో సోదర సోదరీమణుల శుభాకాంక్షలతో రాష్ట్ర ప్రజలకు సేవ చేయడం కొనసాగించడానికి త్వరలో తిరిగి వస్తానని ఆశిస్తున్నట్లు బుధవారం జారీ చేసిన సాంఘిక మాధ్యమ సందేశంలో పేర్కొన్నారు. ఈ సందర్భంగా ప్రతిపక్ష నాయకుడు నవీన్ పట్నాయక్ అనారోగ్యం గురించి తెలిసి ఆందోళన చెందుతున్నట్లు ముఖ్యమంత్రి మోహన్ చరణ్ మాఝి స్పందించారు. ఆయన చికిత్స ప్రక్రియ సజావుగా పూర్తియి త్వరగా కోలుకోవాలని మంచి ఆరోగ్యంతో దీర్ఘకాలం వర్ధిల్లాలని శ్రీ జగన్నాథుడిని ప్రార్థిస్తున్నట్లు తెలిపారు.

చెవిరెడ్డిని అరెస్టు చేయడం అరాచకం

నరసన్నపేట: లేని మద్యం స్కామ్‌ను చూపించి చంద్రబాబు ప్రభుత్వం అనేక మంది వైఎస్సార్ సీపీ నాయకులను అక్రమంగా అరెస్టు చేస్తోందని వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షుడు ధర్మాన కృష్ణదాస్ అన్నారు. మాజీ ఎమ్మెల్యే చెవిరెడ్డి భాస్కరరావును అరెస్టు చేయడం అన్యాయమన్నారు. ఈ మేరకు బుధవారం ఓ ప్రకటన విడుదల చేశారు. కూటమి ప్రభుత్వం అరాచకానికి చెవిరెడ్డి అరెస్టు పరాకాష్ట అని అన్నారు. ఆయన అక్రమ అరెస్టును తీవ్రంగా ఖండిస్తున్నామని తెలిపారు. అబద్ధపు వాంగ్మూలాలు, తప్పుడు సాక్ష్యాలు సృష్టించి సిట్ అధికారులు ఇష్టానుసారంగా వ్యవహరిస్తున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. బెంగళూరులో అదుపులోనికి తీసుకున్న వరకూ చెవిరెడ్డి ఈ కేసులో నిందితుడిగా నమోదు కాలేదని, కేసులకు భయపడేది లేదని తెలిపారు.

పెన్షన్ సమస్యలు పరిష్కరిస్తాం



ఫిర్యాదులు స్వీకరిస్తున్న కలెక్టర్ కీర్తి వాసన్



మాట్లాడుతున్న తిలోత్తమ నాయక్

కొరాపుట్: ప్రభుత్వ ఉద్యోగుల కుటుంబాలకు చెందిన పెన్షన్ సమస్యల పరిష్కారం కోసం ప్రత్యేక అదాలత్ బుధవారం కొరాపుట్ జిల్లా కేంద్రంలోని సద్భావన స్వగృహంలో నిర్వహించారు. కొరాపుట్, మల్కన్‌గిరి జిల్లాలకు చెందిన వారి వినతులు అధికారులు స్వీకరించారు. రాష్ట్ర ప్రభుత్వం తరపున ప్రత్యేక అధికారిక బృందంతోపాటు ఇరు జిల్లాల ఉన్నతాధికారులు హాజరయ్యారు. 500 వినతులు వచ్చాయని, అందులో ప్రత్యక్షంగా 60 మంది వినతిపత్రాలతో వచ్చారని అధికారులు ప్రకటించారు. కొరాపుట్ జిల్లా కలెక్టర్ వి.కీర్తి వాసన్ మాట్లాడుతూ.. కొరాపుట్ జిల్లా నుంచి 400 వినతులు వచ్చాయని, మరో 40 మంది నేరుగా వచ్చి ఫిర్యాదులు చేశారన్నారు. రిటైర్మెంట్ రోజునే ఫైనల్ పెన్షన్ అందేలా చర్యలు తీసుకుంటున్నామన్నారు. మరో వైపు ఇదే శిబిరానికి కొట్‌పాడ్ మాజీ ఎమ్మెల్యే సదానాయక్ సతీమణి తిలోత్తమ నాయక్ వచ్చారు. మీడియాతో మాట్లాడుతూ తన భర్త ఎమ్మెల్యే పని చేశారన్నారు. ఆయన ఇదివరకే మృతి చెందారన్నారు. తనకు పెన్షన్ రాకుండా ఇబ్బందులు వస్తున్నాయన్నారు. బ్యాంక్‌కు వెళ్తే ట్రెజరీకి వెళ్లమన్నారని, ట్రెజరికి వెళ్తే కలెక్టర్‌కు కలవమన్నారని వాపోయారు. తాను ఇదే శిబిరంలో ఫిర్యాదు చేశానన్నారు.

2036 నాటికి మారనున్న రాష్ట్ర రూపురేఖలు

- కొరాపుట్ ఎమ్మెల్యే రఘురాం మచ్చ



ఎమ్మెల్యే మచ్చను సత్కరిస్తున్న కలెక్టర్ పట్వారి



సమావేశానికి హాజరైన ప్రముఖులు, విద్యావేత్తలు

రాయగడ: రానున్న 2036 ఏడాది నాటికి రాష్ట్ర రూపురేఖలు పూర్తిగా మారిపోయే అవకాశాలు మెండుగా ఉన్నాయని కొరాపుట్ నియోజకవర్గ ఎమ్మెల్యే రఘురాం మచ్చ అన్నారు. స్థానిక బిజు పట్నాయక్ ఆడిటోరియంలో బుధవారం జిల్లా యంత్రాంగం ఆధ్వర్యంలో వికసిత్ ఒడిశా-వికసిత్ జిల్లా పేరిట నిర్వహించిన వర్క్‌షాప్‌లో ముఖ్యఅతిథిగా ప్రసంగించారు. వ్యవసాయం, విద్య, వైద్యం, రవాణా, వాణిజ్య రంగాలను అభివృద్ధి చేయగలిగితే రాష్ట్రం సమగ్రాభివృద్ధి చెందుతోందన్నారు. ఆ దిశగా బీజేపీ ప్రభుత్వం భవిష్యత్ ప్రణాళికలు రూపొందిస్తుందని చెప్పారు. సదస్సులో పాల్గొన్న జిల్లా కలెక్టర్ ఫరూల్ పట్వారి మాట్లాడుతూ.. వికసిత్ జిల్లాగా అభివృద్ధిని చూడాలంటే అంతా కలసి కట్టుగా కృషి చేయాలని అన్నారు. లక్ష్య సాధనకు చేయిచేయి కలపాలని ఆమె పిలుపునిచ్చారు. జిల్లా పరిషత్ ముఖ్యకార్యనిర్వాహక అధికారి అక్షయ కుమార్ ఖెముంతో, కటక్ రెవేన్సా కళాశాల అధ్యాపకులు కిషోర్ చంద్ర నాయక్, విద్యావేత్త డీకే మహంతి తదితరులు ప్రసంగించి అభివృద్ధికి నాంది పలకాలని కోరారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మచ్చను అధికారులు సత్కరించారు.

చేతివృత్తులకు చేయూత అందించాలి

- బీజేపీ నేతలు జగన్నాథ మహాపాత్రో, ప్రశాంత్ పాలో



మాట్లాడుతున్న జిల్లా అసిస్టెంట్ బిభురంజన్ స్వయిని



సమావేశానికి విచ్చేసిన చేతివృత్తుల కుటుంబాలు

పర్లాకిమిడి: వికాస్ మేళాలో హస్తశిల్పి కళాకారులు, చేతి వృత్తులు, జిల్లా పరిశ్రమల శాఖ సమన్వయంతో జిల్లా ఇండస్ట్రీస్ కార్యాలయంలో బుధవారం అవగాహన శిబిరంను నిర్వహించారు. ఈ శిబిరంలో హస్తకళల నిగమ్ అధికారి బిభురంజన్ స్వయిని, హస్త శిల్పి అధ్యయన అధికారులు సుశీల్ కుమార్ బారుద్, ప్రియాంకా పాత్రో, బీజేపీ కృషక్ మోర్చా అధ్యక్షుడు ప్రశాంత్ కుమార్ పాలో, జిల్లా సాధారణ కార్యదర్శి (బీజేపీ) జగన్నాథ మహాపాత్రో హాజరయ్యారు. ముఖ్యమంత్రి మోహన్ మరిఖ ప్రభుత్వం.. జిల్లా హస్తకళాకారులు, చేతివృత్తులు వారికి చేయూతనిచ్చే విశ్వకర్మ యోజనా పథకం ద్వారా లబ్ధిపొందడానికి చర్యలు చేపట్టాలని అధికారులను బీజేపీ శ్రేణులు కోరారు. చేతి వృత్తులవారు ఈ విశ్వకర్మ యోజనా పథకం కింద శిక్షణ పొంది మూడు మాసాలైనా ఇప్పటివరకు టీఏ, డీఏ పొందలేకపోయామని శిక్షణార్థులు ఎకరువు పెట్టారు. రాష్ట్రంలో ప్రభుత్వం మారింది, ప్రభుత్వ అధికారులు కూడా మారాలని జిల్లా బీజేపీ సాధారణ కార్యదర్శి జగన్నాథ మహాపాత్రో అన్నారు. హస్త శిల్పి కళాకారులు, చేతి వృత్తులు, ఆత్మనిర్భర్ భారత్‌పై అనేక సార్లు ప్రధాని మోడీ గురుత్వపూర్ణ ప్రసంగాలు చేశారన్నారు. అందువల్ల వారికి ఈ పథకం వర్తించాలని బీజేపీ కృషక్ మోర్చా నాయకులు ప్రశాంత్ పాలో అన్నారు. విశ్వకర్మ యోజన పథకం 18 కులాలు చేతివృత్తులు, హస్తకళాకారులకు వర్తింపజేయాలని అధికారులను కోరారు.

హోటళ్లలో తనిఖీలు



పాడైన ఆహార పదార్థాలు నిల్వలను తనిఖీ చేస్తున్న అధికారులు



దుర్గంధంలో చికెన్ కటింగ్ ప్రాంతం



పాడైన ఆహారంను ఫ్రిజ్‌లో నిల్వ ఉంచిన దృశ్యం



పరిశుభ్రంగా ఉన్నచోట పాత్రలను శుభ్రం చేస్తున్న దృశ్యం

కొరాపుట్: రాష్ట్ర వ్యాప్తంగా డయేరియా ఉన్న నేపథ్యంలో రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు బుధవారం నబరంగ్‌పూర్ జిల్లా కేంద్రంలో ప్రముఖ హోటళ్లపై అధికారులు దాడులు చేశారు. డయేరియాని అడ్డుకోవాలని ఉద్దేశంతో తనిఖీలు చేస్తే హోటళ్లలో దారుణ పరిస్థితులు చూసి అధికారులు నివ్వెరపోయారు. నబరంగ్‌పూర్ పట్టణంలో గల ఏడు హోటళ్లలో సోదాలు జరిపారు. అక్కడ ఉన్న అపరిశుభ్రత, దుర్గంధం, కుళ్లిపోయిన ఆహార పదార్థాలు కనిపించాయి. ప్రముఖ హోటళ్ల తనిఖీని చిత్రీకరిస్తున్న పాత్రికేయుడు ఈ దారుణ పరిస్థితులు చూసి అక్కడిక్కక్కడే వాంతులు చేసుకున్నాడు. రోజుల తరబడి ఉంచిన ఆహార పదార్థాలు వేడి చేసి కస్టమర్లకు అందిస్తున్నారని గమనించారు. వెంటనే అధికారులు చర్యలు చేపట్టారు. పెద్ద ఎత్తున జరిమానాలు విధించారు. ఈ విషయం వెలుగులోనికి రావడంతో అనేక ప్రాంతాల్లో హోటళ్లను మూసివేశారు.

జాతీయ జూడో చాంపియన్‌షిప్‌కు.. మల్కన్‌గిరి విద్యార్థుల ఎంపిక



క్రీడాకారులను అభినందిస్తున్న కలెక్టర్



రుకునాథ్ సీస, రవినాథ్ జిగిడి

మల్కన్‌గిరి: మల్కన్‌గిరి జిల్లా చిత్రకొండ సమితి స్వాభీమాన్ ఏరియా బోడపోదర్ పంచాయతీ లాంబాసింగ్ గ్రామానికి చెందిన ఇద్దరు ఆదివాసీ విద్యార్థులు రుక్‌నాథ్ సీస, రవినాథ్ జిగిడి నాయక్ గూడ పాఠశాలలో చదువుతున్నారు. ఆర్థికంగా వెనుకబడినా క్రీడా ఆసక్తిని కనబర్చడంతో మల్కన్‌గిరి ఔమా గురుకులం, జూడో అసోసియేషన్ సభ్యులు గుర్తించారు. మల్కన్‌గిరి ఔమా గురుకులంలో శిక్షణ ఇచ్చారు. వీరు జాతీయ స్థాయి చాంపియన్‌షిప్‌కు ఎంపిక కావడం జిల్లాకు గర్వకారణమని జిల్లా కలెక్టర్ ఆశీష్ ఈశ్వర్ అన్నారు. బుధవారం ఇద్దరు విద్యార్థులను జిల్లా కలెక్టర్ కార్యాలయంలో అభినందించారు. వారి ప్రయాణం గూర్చి అడిగి తెలుసుకున్నారు. ఈ నెల 20 నుంచి 23వ తేదీ వరకు ఉత్తరప్రదేశ్‌లోని కాన్పూర్ జరగనున్న జూడో పోటీల్లో పాల్గొంటారన్నారు. వీరికి జిల్లా యంత్రాంగం రెడ్ క్రాస్ నుంచి ఆర్థిక సహాయం అందజేశారు.

ప్రతి గిరిజనుడు విద్యావంతుడు కావాలి: సీఎం



ఆదివాసీ శక్తి సమావేశంలో ముఖ్యమంత్రి ప్రసంగం

భువనేశ్వర్: రాష్ట్ర ఘనమైన సాంస్కృతిక వారసత్వంలో గిరిజన సంస్కృతి ప్రత్యేక స్థానం కలిగి ఉంది. రాష్ట్ర జనాభాలో 40 శాతం దళిత, షెడ్యూల్డ్ కుల వర్గాలు. వీరి అభివృద్ధితో రాష్ట్ర సమగ్ర అభివృద్ధి ముడి పడి ఉంది. ప్రతి గిరిజన కుటుంబంలో విద్యావంతుల్ని ఆవిష్కరించడంతో గిరిజన సమాజ అభివృద్ధి బలం పుంజుకుంటుందని రాష్ట్ర ముఖ్యమంత్రి మోహన్ చరణ్ మాఝి ప్రసంగించారు. ప్రతి గిరిజన వ్యక్తిని విద్యావంతునిగా మలిచేందుకు ప్రభుత్వం నిబద్ధతతో కృషి చేస్తుందన్నారు. మయూర్‌భంజ్ జిల్లా బరిపద ప్రాంతం చౌ మైదానంలో రాష్ట్ర స్థాయి ఆదివాసీ శక్తి సమావేశం ప్రారంభం పురస్కరించుకుని ఆయన బుధవారం ప్రసంగించారు. రాష్ట్ర షెడ్యూల్డ్ తెగలు, షెడ్యూల్డ్ కులాలు, బలహీన వర్గాలు, వెనుకబడిన తరగతుల సంక్షేమ శాఖ నిర్వహించిన ఈ సమావేశం పురస్కరించుకుని రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న విభిన్న గిరిజన వర్గాలను ఒకచోట చేర్చి సాంస్కృతిక మార్పిడి, ఐక్యతను పెంపొందించేందుకు అవకాశం కల్పించిందని ముఖ్యమంత్రి కొనియాడారు.

దళిత, వెనుకబడిన వర్గాల్లో విద్యను మరింత అందుబాటులోకి తీసుకురావడానికి మాధ్యమిక మరియు ఉన్నత మాధ్యమిక స్థాయిలలో షాహిద్ మాధో సింగ్ హత్తా ఖొర్చొ (చేతి ఖర్చులు) పథకం ప్రభుత్వం ప్రవేశ పెట్టింది. షాహిద్ లక్ష్మణ్ నాయక్ ఆదర్శ్ ఆశ్రమ విద్యాలయ యోజన కింద రూ. 100 కోట్ల వ్యయ ప్రణాళికతో రెసిడెన్షియల్ పాఠశాలల అభివృద్ధికి ప్రభుత్వం కృషి చేస్తుందన్నారు. ఈ సందర్భంగా గిరిజన జానపదాలు, సంస్కృతి, సంప్రదాయాల పరిరక్షణకు విశేష కృషి చేసినందుకు వివిధ గిరిజన వర్గాల వ్యక్తులను ముఖ్యమంత్రి సత్కరించారు.

ఈ కార్యక్రమంలో పాల్గొన్న మంత్రులు నిత్యానంద గోండ్ (ఎస్టీ - ఎస్సీ అభివృద్ధి), రబీనారాయణ్ నాయక్ (పంచాయతీరాజ్, తాగు నీరు), డాక్టర్ కృష్ణ చంద్ర మహాపాత్రో (గృహ నిర్మాణం మరియు పట్టణాభివృద్ధి), గణేష్ రామ్ సింగ్ ఖుంటియా (అటవీ, పర్యావరణ, వాతావరణ మార్పులు) గిరిజన సంక్షేమం పట్ల తమ నిబద్ధతను పునరుద్ఘాటించారు.

ఈ సభా కార్యక్రమానికి రాజ్య సభ సభ్యురాలు మమతా మొహంతా, బాలాసోర్ లోక్ సభ సభ్యుడు ప్రతాప్ చంద్ర షడంగి, మయూర్‌భంజ్ లోక్ సభ సభ్యుడు నొబొ చరణ్ మాఝీ, శాసన సభ సభ్యులు భాస్కర్ మధేయ్ (ఉదొలా), పద్మ చరణ్ హైబురు (కరంజియా), భదవ్ హంసదా (సొరొసొకొణా), ప్రకాశ్ సోరెన్ (బరిపద), జలెన్ నాయక్ (రాయిరంగపూర్), సంజలి ముర్ము (బంగిరిపోషి), సనాతన్ బిజులి (బొడొసాహి) తదితర ప్రముఖులు హాజరయ్యారు.

క్లుప్తంగా

సికిల్ సెల్ వ్యాధికి రక్తమార్పిడే చికిత్స

• డీఎంహెచ్‌ఓ డాక్టర్ జీవనరాణి



సమావేశంలో మాట్లాడుతున్న డీఎంహెచ్‌ఓ జీవనరాణి

విజయనగరం ఫోర్ట్: సికిల్ సెల్ వ్యాధికి రక్తమార్పిడే చికిత్స అని డీఎంహెచ్‌ఓ డాక్టర్ ఎస్.జీవనరాణి తెలిపారు. ఈ మేరకు స్థానిక జిల్లా వైద్య ఆరోగ్యశాఖ కార్యాలయంలో బుధవారం సాయంత్రం పోగ్రాం అధికారులతో సికిల్‌సెల్, డయేరియా వ్యాధులపై నిర్వహించిన సమావేశంలో ఆమె మాట్లాడుతూ సికిల్‌సెల్ వ్యాధి ఉన్న వారు హిమటాలజిస్ట్, సాధారణ వైద్యుడి సంరక్షణలో చికిత్స తీసుకోవాలని సూచించారు. ప్రతి ఒక్కరూ సమతుల ఆహారాన్ని తీసుకోవాలని చెప్పారు. వ్యక్తిగత శుభ్రత, పరిసరాల పరిశుభ్రత పాటించకపోయినా, సురక్షిత మంచినీరు తీసుకోకపోయినా డయేరియా వ్యాధి వస్తుందన్నారు. సమావేశంలో డీఎల్‌ఓ డాక్టర్ కె.రాణి, డీఐఓ డాక్టర్ అచ్యుతకుమారి, డిప్యూటీ డీఎంహెచ్‌ఓ డాక్టర్ ఎస్.సూర్యనారాయణ, డీపీహెచ్ఎన్‌ఓ మామిడి సత్యవతి, డెమో చిన్నతల్లి పాల్గొన్నారు.

అట్రాసిటి కేసుపై డీఎస్పీ దర్యాప్తు



రిమ్స్ ఆస్పత్రిలో బాధితుడి నుంచి వివరాలు సేకరిస్తున్న డీఎస్పీ రాఘవులు

వంగర: మండల పరిధి కొప్పరవలస సమీపంలో కొండచాకరాపల్లి ఐటీడీఏ కాలనీకి చెందిన గిరిజన యువకుడిని కులం పేరుతో దూషించి దాడికి పాల్పడిన ఘటనపై చీపురుపల్లి డీఎస్పీ ఎస్.రాఘవులు బుధవారం దర్యాప్తు నిర్వహించారు. ఐటీడీఏ కాలనీకి చెందిన బంటుపల్లి శంకరదొర శ్రీకాకుళం రిమ్స్‌లో చికిత్స పొందుతుండడంతో అక్కడికి వెళ్లి వివరాలు సేకరించిన అనంతరం కొప్పరవలస సమీపంలో సంఘటన జరిగిన ప్రదేశంలో డీఎస్పీ దర్యాప్తు చేపట్టారు. ఘటనకు దారి తీసిన అంశాలపై వివరాలు సేకరించారు. సమగ్ర దర్యాప్తు అనంతరం నిందితులను అదుపులోకి తీసుకుని అరెస్ట్ చేస్తామని డీఎస్పీ తెలిపారు. కార్యక్రమంలో ఎస్సై షేక్ శంకర్, పలువురు ఉద్యోగులు ఉన్నారు.

9 మద్యం సీసాలతో వ్యక్తి అరెస్టు



పట్టుబడిన మద్యంతో సీఐ రవికుమార్ తదితరులు

పూసపాటిరేగ: మండలంలోని కనిమెట్ట గ్రామంలో అనధికారంగా మద్యం కలిగి వున్న వ్యక్తిని అదుపులోకి తీసుకున్నట్లు భోగాపురం ఎక్సైజ్ సీఐ వి.రవికుమార్ బుధవారం తెలియజేశారు. అనధికారంగా 9 మద్యం సీసాలు కలిగి ఉండడంతో అదుపులోకి తీసుకుని కేసు నమోదు చేసినట్లు తెలిపారు. ఎవరైనా అనధికారికంగా మద్యం అమ్మినట్లయితే సమాచారం ఇవ్వాలని, సమాచారం ఇచ్చిన వ్యక్తుల వివరాలు గోప్యంగా ఉంచుతామన్నారు. దాడుల్లో ఎస్సై చంద్రమోహన్, సురేష్, సిబ్బంది సత్యనారాయణ, మహేష్ పాల్గొన్నారు.

రెండు కేజీల గంజాయి స్వాధీనం

విజయనగరం క్రైమ్: విజయనగరం రూరల్ పోలీస్ స్టేషన్ పరిధిలో ఇద్దరు గంజాయి నిందితులను పోలీసులు బుధవారం అదుపులోకి తీసుకున్నారు. రూరల్ పీఎస్ పరిధి జమ్ములో గంజాయిని అక్రమంగా రవాణా చేస్తుండగా రూరల్ ఇన్‌చార్జ్ సీఐ శ్రీనివాస్, ఎస్సై అశోక్ సిబ్బందితో కలిసి పట్టుకున్నారు. పట్టుకున్న ఇద్దరు నిందితులను విజయనగరంలోని సాకేటి వీధికి చెందిన తేజస్వరూప్, సాయిలుగా గుర్తించి వారి దగ్గర నుంచి రెండు కేజీల 310 గ్రాముల గంజాయిని మధ్యాహ్నం ఒంటి గంట ప్రాంతంలో స్వాధీనం చేసుకున్నామని సీఐ శ్రీనివాస్ చెప్పారు.

యోగాపై సమీక్ష

పూసపాటిరేగ : విశాఖలో ఈ నెల 21న జరగబోయే అంతర్జాతీయ యోగా దినోత్సవాన్ని విజయవంతం చేయాలని డిప్యూటీ తహసీల్దార్ రమేష్ అన్నారు. మండల పరిషత్ కార్యాలయంలో వివిధ శాఖల అధికారులతో బుధవారం యోగాపై సమీక్షించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ యోగాంధ్ర కార్యక్రమానికి ప్రతి గ్రామం నుంచి ప్రజలను భాగస్వామ్యం చేయాలని సూచించారు. కార్యక్రమంలో ఎంపీడీవో ఎం.రాధిక, ఏపీవో తిరుపతిరావు, ఏపీఎం అచ్చుతరావుతో పాటు వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

డాక్టర్ జయచంద్రనాయుడుకు అభినందనలు

విజయనగరం ఫోర్ట్: డాక్టర్ ఎన్టీఆర్ హెల్త్ యూనివర్సిటీ ఎగ్జిక్యూటివ్ మెంబర్‌గా నియమితులైన డాక్టర్ ఎం.జయచంద్రనాయుడుకు వెలమ సంక్షేమ సంఘం ప్రతినిధులు బుధవారం ఆయన నివాసంలో అభినందనలు తెలియజేశారు. అభినందనలు తెలిపిన వారిలో గొట్టాపు చిన్నంనాయుడు, రామకృష్ణ, కృష్ణమూర్తి తదితరులు ఉన్నారు.

రెచ్చిపోతున్న పోకిరీలు

- సతివాడలో పాఠశాలల సముదాయంలో వికృత చేష్టలు
- ఉదయం, సాయంత్రం వేళల్లో మితిమీరుతున్న ఆగడాలు
- అలంకార ప్రాయంగా నిఘానేత్రాలు
- ఆందోళనలో బాలికల తల్లిదండ్రులు
- పోకిరీల ఆట కట్టించాలని పోలీసులకు విజ్ఞప్తి



సతివాడలో అలంకార ప్రాయంగా సీసీ కెమెరాలు

నెల్లిమర్ల రూరల్: విద్యాసంస్థలు పునఃప్రారంభమయ్యాయి. ప్రస్తుతం పాఠశాలలు, కళాశాలల్లో అడ్మిషన్లు జోరుగా కొనసాగుతున్నాయి. ఎన్నో ఆశలతో సుదూర ప్రాంతాల నుంచి విద్యార్థులు ఆయా విద్యాసంస్థల్లో చదువుకునేందుకు కొత్తగా చేరుతున్నారు. అప్పటికే చదువుతున్న విద్యార్థులు బ్యాగులు చేతబట్టి చదువులో నిమగ్నమయ్యారు. ఈ తరుణంలో కొంతమంది పోకిరీల వికృత చేష్టలు కూడా అధికమయ్యాయి. మండలంలోని సతివాడ గ్రామంలో పక్కపక్కనే ఆదర్శపాఠశాల, ఉన్నత పాఠశాల, బాలికల వసతి గృహంతో పాటు ఓ ప్రైవేట్ జూనియర్ కళాశాల ఉన్నాయి. సమీప 25 గ్రామాలకు చెందిన విద్యార్థులు పై చదువులు చదివేందుకు సతివాడ అనువైన ప్రదేశం. ఆయా విద్యాసంస్థలకు సుదూర ప్రాంతాల నుంచి వస్తూ వందలాది మంది బాలికలు చదువును సాగిస్తున్నారు. పోకిరీల ఆగడాలు మితిమీరడంతో తమ పిల్లల భద్రతకు ముప్పు పొంచి ఉందని తల్లిదండ్రులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

చెవులు పగిలేలా సౌండ్లు..గుండెలదిరేలా స్టంట్లు

సతివాడలోని విద్యాసంస్థల వద్ద కొన్ని రోజులుగా పోకిరీల వికృత చేష్టలు అధికమయ్యాయని స్థానికులతో పాటు తల్లిదండ్రులు చెబుతున్నారు. ఉదయం 8 గంటల నుంచి 9 గంటల మధ్యలో అలాగే మధ్యాహ్నం 3;30గంటల నుంచి 4 గంటల సమయం వరకు సమీప గ్రామాలకు చెందిన కొంతమంది యువకులు బైక్‌లపై నిత్యం రెక్కీ నిర్వహిస్తున్నట్లు చెబుతున్నారు. బాలికలు నడిచి వెళ్తున్నప్పుడు బైక్‌లపై వారిని అనుసరిస్తూ అసౌకర్యానికి గురి చేస్తున్నారని అక్కడి వర్తక వ్యాపారులే స్వయంగా చెబుతుండడం గమనర్హం. అత్యంత వేగంతో బైక్ రైడ్ చేస్తూ చెవులు పగిలేలా సౌండ్ హార్న్‌లు కొడుతున్నారని, గుండెలదిరేలా బైక్‌లపై ఫీట్లు చేస్తున్నారని చెబుతున్నారు. ఎవరు ప్రశ్నించినా వినే పరిస్థితిలో ఉండడం లేదని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

అలంకార ప్రాయంగా నిఘా నేత్రాలు..

సతివాడ ఉన్నత పాఠశాల వద్ద కొన్నేళ్ల క్రితం అధునాతన సీసీ కెమెరాలను ఏర్పాటు చేశారు. అయితే అప్పట్లో వాటికి స్టోరేజ్ సౌకర్యం కల్పించకపోవడంతో కేవలం లైవ్ కవరేజ్ తప్ప డేటా నిక్షిప్తం కావడం లేదు. ఒకవేళ ఏదైనా ఘటన జరిగితే జరిగిన ఆ ఘటనను చూసేందుకు ఆస్కారం లేదని పోలీస్ వర్గాలే చెబుతున్నాయి. దీంతో విద్యాసంస్థల సముదాయంలో ఏర్పాటు చేసిన సీసీ కెమెరాలు అలంకార ప్రాయంగానే మారాయి. ఎస్పీ వకుల్ జిందల్ ఆదేశాలతో ఇటీవల ఓ దాత సహకారంతో ఉన్నత పాఠశాల వద్ద ఒక సీసీ కెమెరాను స్థానిక పోలీసులు ఏర్పాటు చేశారు. అధునాతన సీసీ కెమెరాలకు కూడా స్టోరేజ్ సౌకర్యాన్ని కల్పిస్తే భవిష్యత్తులో మంచి ఫలితాలు వస్తాయని, పోకిరీల ఆట కూడా కట్టించవచ్చని స్థానికులు అభిప్రాయం వ్యక్తం చేస్తున్నారు.

కౌన్సెలింగ్ ఇస్తే మంచి ఫలితాలు

విద్యాసంస్థల వద్ద అల్లరి చేష్టలు చేస్తున్న పోకిరీలపై పోలీసులు మఫ్టీలో నిఘా పెట్టాల్సిన అవసరం ఉంది. ప్రతి ఏడాది పోకిరీల చేష్టలు పెరుగుతూ వస్తున్నాయి. నియంత్రణ లేకపోవడంతో జరగకూడని ఘటనలు జరిగితే బాధ్యత ఎవరు వహిస్తారని తల్లిదండ్రులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. చెడ్డ పేరు రాకముందే మేలుకుంటే మంచి ఫలితాలు వస్తాయని చెబుతున్నారు. అటువంటి వారిని గుర్తించి కౌన్సెలింగ్ ఇస్తే అదుపులో ఉండే అవకాశం ఉందని అభిప్రాయ పడుతున్నారు.

అడ్డూ అదుపు లేకుండా పోతోంది:



సతివాడ విద్యా సంస్థల వద్ద కొంతమంది నిత్యం బైక్‌లపై మితి మీరిన వేగంతో వెళ్తూ హడలెత్తిస్తున్నారు. వారి చర్యలకు అడ్డూఅదుపూ లేకుండా పోతోంది. ఉదయం, సాయంత్రం వేళల్లో కొంతమంది యువత నిత్యం పహారా కాస్తున్నారని మా పిల్లలు చెబుతున్నారు. సంబంధిత అధికారులు స్పందించి పోకిరీలను అదుపులో పెట్టాలి.

పండాది శ్రీనివాసరావు, వల్లూరు గ్రామం

పూర్తిస్థాయిలో నిఘా పెడతాం:



సతివాడలోని విద్యాసంస్థల సముదాయం వద్ద పూర్తిస్థాయిలో నిఘా పెడతాం. మఫ్టీలో విధులు నిర్వహించి అల్లరి చేష్టలకు పాల్పడుతున్న పోకిరీలను గుర్తించి అదుపులోకి తీసుకుంటాం. గతంలో ఏర్పాటు చేసిన సీసీ కెమెరాలకు స్టోరేజీ సదుపాయం లేకపోవడంతో కొత్తగా ఒక సీసీ కెమెరాను ఏర్పాటు చేశాం. శాంతి భద్రతల పరిరక్షణకు నిరంతరం కృషి చేస్తున్నాం. ఇప్పటికే గ్రామాల్లో పర్యటించి ప్రజలు, యువకులకు అవగాహన కల్పిస్తున్నాం. ఎవరైనా బాలికల జోలికి వెళ్తే చర్యలు తీవ్రంగా ఉంటాయి.

గణేష్, ఎస్సై, నెల్లిమర్ల

యంత్రాలు అడ్డుకుని జిందాల్‌కు వ్యతిరేకంగా నినాదాలు చేస్తున్న నిర్వాసిత రైతులు



జిందాల్ బెంబేలు..!

- పనులు అడ్డుకున్న నిర్వాసితులు
- భవిష్యత్‌పై భరోసా ఇవ్వాలని నినాదాలు
- పోలీసులకు ఫిర్యాదు చేసిన జిందాల్ యాజమాన్యం
- వెనక్కి తగ్గని నిర్వాసితులు

శృంగవరపుకోట: మా భూములు లాక్కుని మాకు భవిష్యత్ లేకుండా చేశారు. ఉద్యోగాలు ఇస్తామని చెప్పి కూలోళ్లను చేశారు. కంపెనీ పేరుతో భూములు లాక్కుని 18ఏళ్లు ఉంచుకుని ఇప్పుడు రియల్ ఎస్టేట్ వ్యాపారాలు చేసుకుంటే మేము చేతులు ముడుచుకుని కూర్చోవాలా..? మాభూములు మేము సాగుచేస్తాం..? అవసరమైతే ప్రాణాలు పోయినా పోరాటానికి సిద్ధంగా ఉన్నాం..అంటూ జిందాల్ నిర్వాసితులు తెగేసి చెప్పారు. ఈ మేరకు బుధవారం మండలంలోని ముషిడిపల్లి పంచాయతీ పరిధి దాసుళ్లపాలెం వద్ద భూముల్లో జిందాల్ యాజమాన్యం పనులు చేసేందుకు జేసీబీలను, కూలీలను పంపింది. ఈ విషయం తెలుసుకున్న జిందాల్ నిర్వాసిత గ్రామాల రైతులు, మహిళలు అక్కడికి చేరుకుని పనులు అడ్డుకున్నారు. యంత్రాలు, మనుషులు అంతా తమ భూములు వదిలి బయటకు వెళ్లాలని లేకుంటే పరిస్థితులు తీవ్రంగా ఉంటాయని ధ్వజమెత్తారు. మా బతుకులకు భరోసా ఇవ్వండని అడిగితే మాట్లాడని జిందాల్ పెద్దలు, ప్రభుత్వ పెద్దలు ఏ హక్కుతో మా భూముల్లోకి వస్తున్నారు. నమ్మించి గొంతు కోసి, బతుకులు బుగ్గి చేసి, ఇప్పుడు వ్యాపారానికి రెడీ అయిపోతున్నారా? అంటూ ఆగ్రహం వ్యక్తంచేశారు. రైతులు గట్టిగా అడ్డుకోవడంతో జిందాల్ ప్రతినిధులు ఎస్.కోట పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. వారి ఫిర్యాదుతో ఏఎస్సై గోవిందరావు సిబ్బంది వచ్చి నిర్వాసిత రైతులతో మాట్లాడుతూ పనులు అడ్డుకోవద్దని, స్థానిక ప్రజాప్రతినిధులతో చర్చల ద్వారా సమస్య పరిష్కరించుకోవాలని, పోలీస్ బందోబస్తు ఇచ్చైనా పనులు చేయిస్తామని చెప్పడంతో రైతులు భీష్మించి మధ్యాహ్నం 2గంటల వరకూ కూర్చున్నారు.

కల్లబొల్లి కబుర్లు చెప్పి..భూములు లాక్కుని..

2008లో అప్పటి జెడ్పీటీసీ, నేటి ఎమ్మెల్సీ రఘురాజులు తమ బతుకులు బాగుపడతాయని చెబితే భూములిచ్చాం. అప్పుడు కంపెనీ మాకు స్కూళ్లు, ఆస్పత్రులు, పార్కులు కడతాం, ఇంటికో ఉద్యోగం ఇస్తాం. 60యేళ్లు దాటిన వాళ్లకి పెన్షన్ ఇస్తాం. ఇళ్లు పోయిన వాళ్లకి ఇళ్లు కట్టిస్తాం, బోర్లు వేయిస్తాం. షెడ్లు కట్టిస్తామని కల్లబొల్లి కబుర్లు చెప్పారు. వాటిలో ఒక్కటి కూడా నెరవేర్చకుండా, ప్రభుత్వాల్లో పెద్దలకు సూట్‌కేసులు ఇచ్చి, భూములు అమ్మేసుకుని సొమ్ము చేసుకోవాలని వస్తున్నారు. కోట్లు విలువ చేసే భూమికి ప్రభుత్వ ధర అనిచెప్పి కారు చౌకగా కొట్టేశారని వాపోయారు. ప్రభుత్వాలకు నిర్వాసితుల గోడు పట్టదా? పార్టీల పెద్దలు, ప్రజాసంఘాలు, అధికారులు, మీడియా అందరికీ నాడు జిందాల్ ఇచ్చిన హామీలు తెలియవా? అన్నీ కాగితాలపై ఉన్నాయి కదా. ఇప్పుడు ఎవ్వరూ మాకు మద్దతు ఎందుకు ఇవ్వరు? డబ్బున్నోళ్లకే వత్తాసు పలుకుతారా? అంటూ నిలదీశారు. తమలో సహనం చచ్చిందని ఇంకా బెదిరించాలని, తొక్కేయాలని చూస్తే తిరుగుబాటుకు సిద్ధమని తేల్చిచెప్పారు. జిందాల్ వ్యవహారంపై రాష్ట్రపతికి లేఖ రాస్తామన్నారు. జిందాల్ యాజమాన్యం మాకు ఇచ్చిన హామీలు తీర్చనప్పుడు మాభూములతో వ్యాపారం చేయాలనుకున్నప్పుడు మాతో మాట్లాడాల్సిన అవసరం లేదా? అని ప్రశ్నించారు.

కూటమి పెద్దలకు ముడుపులు

జిందాల్ పెద్దలు కేంద్రంలో పెద్దల్ని, కూటమిపెద్దల్ని కలిసి ముడుపులు ఇచ్చేసి భూమిపూజకు వచ్చేయండి అని చెప్పడం..ప్రభుత్వ పెద్దలు తలాడించి సిద్ధమవడానికి సిగ్గు లేదా? అంటూ మండిపడ్డారు. జిందాల్ పెద్దలు, ప్రభుత్వ పెద్దలు తమ న్యాయపరమైన డిమాండ్లు తీర్చి, తమకు ఇవ్వాల్సిన రాయితీలు ఇచ్చి, సౌకర్యాలు కల్పించాలని, తమకు ఎలా ఉపాధి కల్పిస్తారో తేల్చి చెప్పకుండా పనులు అంటూ భూముల్లోకి వస్తే తగిన రీతిలో బుద్ధి చెబుతామంటూ నిర్వాసితులు స్పష్టం చేశారు.

జీఎస్టీ వసూలు చేసి రెవెన్యూ పెంచాలి



పాల్గొన్న వివిధ శాఖల జిల్లా అధికారులు



మాట్లాడుతున్న కలెక్టర్ డాక్టర్ బీఆర్అంబేడ్కర్

- కలెక్టర్ డాక్టర్ బీఆర్ అంబేడ్కర్

విజయనగరం అర్బన్: జీఎస్టీ, బకాయిలు వసూలు చేయడం ద్వారా జిల్లా రెవెన్యూను పెంచడానికి కృషి చేయాలని కలెక్టర్ డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ పిలుపునిచ్చారు. జిల్లాలో మొదటి త్రైమాసికంలో 85 శాతం మాత్రమే జీఎస్టీ చెల్లింపులు జరిగాయని ఇది శతశాతానికి చేరాలని కలెక్టర్ సూచించారు. ఈ మేరకు బుధవారం కలెక్టరేట్‌లోని సమావేశ మందిరంలో జీఎస్టీ అధికారులతో పాటు పలు శాఖల అధికారులతో సమన్వయ సమావేశం కలెక్టర్ అధ్యక్షతన జరిగింది. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ పన్నుల రూపంలో ప్రభుత్వానికి ఆదాయం చేరితేనే సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలకు అవకాశం ఉంటుందని, జీఎస్టీ, బకాయిల వసూలులో జిల్లా అధికారులు సహకరించాలని కోరారు. సర్వీస్ టాక్స్, గూడ్స్ టాక్స్ చెల్లించవలసి ఉంటుందని రిజిస్ట్రేషన్లు పెంచడం ద్వారా రెవెన్యూ పెరుగుతుందన్నారు. జిల్లాలో ఉన్న ఎంఎస్ఎంఈల వివరాలను కొత్తగా స్థాపించిన పరిశ్రమల వివరాలను పరిశ్రమల శాఖ వారు జీఎస్‌టీ కార్యాలయానికి ఇవ్వాలని సూచించారు. కొత్తగా ఏర్పాటు చేసిన వాణిజ్య సముదాయాల వివరాలను మున్సిపల్ కమిషనర్ అందజేయాలన్నారు. పాత బకాయిల వివరాలను జీఎస్టీ శాఖ అందించాలని వాటిని బ్యాంకులకు అందజేయడం ద్వారా బకాయిలు వసూలయ్యేలా ఎల్‌డీఎం చూడాలని స్పష్టం చేశారు. భవన నిర్మాణాలు చేపట్టే బిల్డర్లు ఫ్లాట్స్‌ను కట్టి అమ్మేస్తున్నారని జీఎస్‌టీ చెల్లించడం లేదని వాటి వివరాలను కూడా రిజిస్ట్రేషన్ శాఖ అందజేయాలని కోరారు. సమావేశంలో జిల్లా రెవెన్యూ అధికారి శ్రీనివాసమూర్తి, జిల్లా పరిషత్ సీఈఓ సత్యనారాయణ, ఎల్‌డీఎం రమణమూర్తి, జీఎస్టీ డిప్యూటీ కమిషనర్ వల్లి, అసిస్టెంట్ కమిషనర్లు అచ్చయ్య, రమేష్ కుమార్, పరిశ్రమల శాఖ జీఎం కరుణాకర్, మున్సిపల్ కమిషనర్లు, ఆర్‌డీఓలు, వివిధ శాఖల జిల్లా అధికారులు పాల్గొన్నారు.

వైఎస్సార్‌సీపీ రాష్ట్ర కమిటీల్లో జిల్లా నాయకులు

విజయనగరం: వైఎస్సార్‌సీపీ అధిష్టానం చేపడుతున్న పార్టీ సంస్థాగత నియామకాల్లో భాగంగా రాష్ట్ర అనుబంధ కమిటీల్లో పలువురు జిల్లా నాయకులకు స్థానం లభించింది. మాజీ ముఖ్యమంత్రి, పార్టీ అధినేత వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆదేశాల మేరకు బుధవారం పార్టీ కేంద్ర కార్యాలయం ఒక ప్రకటన విడుదల చేసింది. రాష్ట్ర అంగన్వాడీ వింగ్ సంయుక్త కార్యదర్శిగా చీపురుపల్లికి చెందిన బెవర ఉమాకుమారి, గజపతినగరం నియోజకవర్గానికి చెందిన అలమండ వాణి నియమితులయ్యారు. అదేవిధంగా రాష్ట్ర పబ్లిసిటీ వింగ్ కార్యదర్శిగా ఎస్.కోట నియోజకవర్గానికి చెందిన గొరపల్లి జయప్రకాశ్, సంయుక్త కార్యదర్శిగా నెల్లిమర్ల నియోజకవర్గానికి చెందిన మహంతి కృష్ణమోహన్, రాష్ట్ర గ్రీవెన్స్ సెల్ కార్యదర్శిగా బొబ్బిలికి చెందిన బొమ్మి తిరుపతిరావు, సంయుక్త కార్యదర్శిగా గజపతినగరానికి చెందిన ఎం.కృష్ణంరాజులకు అవకాశం కల్పించారు. అలాగే సాంస్కృతిక విభాగం సంయుక్త కార్యదర్శిగా బొబ్బిలి నియోజకవర్గానికి చెందిన వంగపండు శ్రీరాములు నియమితులయ్యారు.

యువకుడి ఆత్మహత్య

సాలూరు: పట్టణంలోని బంధువుల ఇంటికి వచ్చిన రాజస్తాన్ నుంచి వచ్చిన యువకుడు బంజారా మహావీర్(17) బుధవారం ఆత్మహత్యకు పాల్పడినట్లు టౌన్ సీఐ అప్పలనాయుడు తెలిపారు. ఆయన తెలిపిన వివరాల ప్రకారం,.ఈ నెల17న మహావీర్ విశాఖపట్నంలో ఓ కంటి ఆస్పత్రికి వెళ్లి పరీక్ష చేసుకోగా కంటికి ఆపరేషన్ చేయాలని వైద్యులు సూచించారు. దీనితో భయానికి గురైన మహావీర్ సాలూరులో బంధువులు ఉంటున్న అద్దె ఇంట్లో బుధవారం ఉరివేసుకున్నాడు. ఇంటి యజమాని విశ్వేశ్వరరావు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ తెలిపారు.

ఆర్టీసీ ఢీకొని మహిళ మృతి

• ఇద్దరికి గాయాలు



అప్పమ్మ మృతదేహం

పార్వతీపురం రూరల్: మండలంలోని నర్సిపురం సమీపంలో అంతరాష్ట్ర రహదారిపై ఆర్టీసీ బస్సు ఢీకొని బుధవారం రాత్రి ఒక మహిళ మృతి చెందగా మరో ఇద్దరికి గాయాలయ్యాయి. ఈ మేరకు ఘటనా స్థలానికి పార్వతీపురం రూరల్ ఎస్సై బి.సంతోషి కుమారి చేరుకుని వివరాలు సేకరించారు. అనంతరం ఎస్సై వివరాలు తెలియజేశారు. నర్సిపురం శివారులో ఉన్న చర్చికి వెళ్లి తిరిగి తమ గ్రామానికి రహదారిపై ఇద్ద రు మహిళలు నడుస్తూ, మరో దివ్యాంగుడు మూడు చక్రాల బండిపై వస్తుండగా ఆర్టీసీ బస్సు ఢీకొంది. ఈ ప్రమాదంలో నర్సిపురం గ్రామానికి చెందిన ఎంద్రాజు అప్పమ్మ అక్కడికక్కడే మృతి చెందగా ఎస్.రాములమ్మ, ఎ.అప్పలరాజులకు గాయాలు కావడంతో ఆస్పత్రికి తరలించినట్లు ఎస్సై తెలిపారు.

అనధికార దత్తతతో అగచాట్లు..!

- గుట్టుగా జరుగుతున్న దత్తత వ్యవహారం
- రిజిస్ట్రేషన్ చేసుకుని కొంతమంది దత్తత
- చట్టబద్ధంగా తీసుకుంటే శిశువుకు హక్కులు



శిశువును దత్తత ఇస్తున్న ఐసీడీఎస్ అధికారులు (ఫైల్)

విజయనగరం ఫోర్ట్:

డెంకాడ మండలానికి చెందిన దంపతులు మగ శిశువును తెలిసిన వారి దగ్గర నుంచి రిజిస్ట్రేషన్ కార్యాలయంలో దత్తత తీసుకున్నారు. అయితే అశిశువుకు జనన ధ్రువీకరణ పత్రం అవసరం పడడంతో రిజిస్ట్రేషన్ కార్యాలయంలో దరఖాస్తు చేస్తే జనన ధ్రువీకరణ పత్రం ఇవ్వలేమని అధికారులు తేల్చి చెప్పారు. దీంతో వారు ఐసీడీఎస్ కార్యాలయంలో సంప్రదించగా రిజిస్ట్రేషన్ కార్యాలయంలో వెళ్లి అడగాలని చెప్పడంతో వెనుదిరిగారు. ఈ విషయం అధికారుల దృష్టికి వచ్చింది. అధికారుల దృష్టికి రాకుండా అనధికారికంగా దత్తత ఇచ్చేస్తున్న సంఘటనలు అనేకం ఉన్నాయి. అనధికారికంగా దత్తత ఇవ్వడం, తీసుకోవడం చట్టరీత్యా నేరమని అధికారులు పదేపదే చెబుతున్నారు. కానీ ఏ ఒక్కరూ పట్టించుకోవడం లేదు. గుట్టుగా పిల్లలను దత్తత ఇచ్చేస్తున్నారు. కొంతమంది పిల్లలను దత్తత ఇచ్చే తల్లిదండ్రులకు డబ్బులు, బంగారం వంటివి ఇచ్చి పిల్లలను అనధికారికంగా దత్తత తీసుకుంటున్నారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. కొంతమంది గర్భం దాల్చిన వారు వైద్యఖర్చులు భరించిన వారికి పిలలను దత్తత ఇస్తున్నారనే విమర్శలు వినిపిస్తున్నాయి.

దత్తత పేరిట విక్రయాలు

అభంశుభం పిల్లలను బాహ్య ప్రపంచం తెలియకుండానే కన్నతల్లి ముఖం చూడకుండానే ఇంకొకరికి ఇచ్చేస్తున్నారు. పోనీ అనధికారికంగా దత్తత ఉచితంగా ఇస్తున్నారా? అంటే అదీ లేదు. వేలు, లక్షలు తీసుకుని పిల్ల లను దత్తత ఇస్తున్నారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. ఆడపిల్ల అయితే రూ. లక్ష నుంచి రూ. లక్షన్నర..మగ పిల్లవాడు అయితే రూ. 2 లక్షల నుంచి రూ.3 లక్షలు వరకు విక్రయిస్తున్నారనే విమర్శలు వినిపిస్తున్నాయి.

అజ్ఞాతవ్యక్తుల సమాచారంతో..

గ్రామీణ ప్రాంతంలో బాల్య వివాహాలు జరిగినా, అనధికారికంగా దత్తత ఇచ్చినా ఐసీడీఎస్ అధికారులకు అంగన్‌వాడీలు తెలియజేయాలి. కానీ అంగన్‌వాడీలు ఈ విషయాలను అధికారులకు తెలియజేయడం లేదనే గుసగుసలు వినిపిస్తున్నాయి. అజ్ఞాత వ్యక్తులు సమాచారం ఇస్తే అధికారులకు అనధికారిక దత్తత, బాల్య వివాహాల గురించి తెలుస్తోంది.

పర్యవేక్షణ కరువు

అనధికారికంగా పిల్లలను దత్తత ఇచ్చిన వారిని గుర్తించి తిరిగి ఆ శిశువులను తల్లిదండ్రులకే అప్పజెప్పినప్పుడు 6 నెలల వరకు పర్యవేక్షణ చేయాలి. శిశువును మళ్లీ ఎవరికైనా దత్తత ఇచ్చేశారా? లేదంటే వారే పెంచుతున్నారా? అనేది ఐసీడీఎస్ అధికారులు, అంగన్‌వాడీ సిబ్బంది పర్యవేక్షించాలి. కానీ అటువంటి పర్యవేక్షణ చేయడం లేదనే తెలుస్తోంది.

చట్టప్రకారం దత్తత తీసుకోవాలి

పిల్లలు లేని తల్లిదండ్రులు దత్తత తీసుకోవాలంటే ఐసీడీఎస్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న శిశుగృహ కార్యాలయానికి ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలి. అయితే పిల్లలు దత్తత తీసుకోవాలనుకున్న తల్లిదండ్రులు ఆరోగ్యవంతులై ఉండాలి, ఆర్థికస్థితి బాగుండాలి. ఎటువంటి వ్యాధులు ఉండకూడదు. పిల్లలు పుట్టరని వైద్యుల ధ్రువీకరణ పత్రం ఇవ్వాలి. వయస్సు 45 ఏళ్ల లోపు ఉండాలి. అటువంటి వారు దరఖాస్తు చేసుకుంటే అధికారులు పరిశీలించి అర్హులు అనుకుంటే అప్పుడు దత్తత ఇస్తారు.

అనధికారిక దత్తతతో చిక్కులు

అనధికారిక దత్తతతో అనేక చిక్కులు ఉన్నాయి. వారికి జనన ధ్రువీకరణ పత్రం రాదు. అదేవిధంగా దత్తత వెళ్లిన పిల్లలకు హక్కుల కోసం పోరాటం చేయడానికి వీలుండదు. దీని వల్ల నష్టపోవాల్సిన పరిస్థితి.

అనధికారిక దత్తత చెల్లదు:

అనధికారిక దత్తత తీసుకుంటే అది చెల్లదు. చట్ట ప్రకారమే పిల్లలను దత్తత తీసుకోవాలి. అనధికారికంగా దత్తత తీసుకుంటే చర్యలు తీసుకుంటాం.

టి.విమలరాణి, పీడీ, ఐసీడీఎస్

కొట్లాటపై కేసు నమోదు

పార్వతీపురం రూరల్: పట్టణంలోని బెలగాం ప్రాంతంలో ఎస్సీ కాలనీకి చెందిన ఇద్దరు అన్నదమ్ముల మధ్య తండ్రి ద్వారా సంక్రమించిన స్థలం హక్కు కోసం వాగ్వాదం జరిగింది. ఈ వివాదం తోడికోడళ్ల మధ్య కొట్లాటకు దారి తీసింది. ఈ మేరకు పరస్పర ఫిర్యాదులతో కేసు నమోదు చేసినట్లు పట్టణ సీఐ కె మురళీధర్ తెలిపారు.

యథేచ్ఛగా గ్రావెల్ రవాణా



పొగిరి గ్రామం నుంచి రాజాం అక్రమంగా తరలిస్తున్న అక్రమ గ్రావెల్

రాజాం: మండలంలోని పొగిరి గ్రామ సమీప ప్రాంతాల నుంచి గ్రావెల్ యథేచ్ఛగా అక్రమ రవాణా జరుగుతోంది. ఈ ప్రాంతానికి చెందిన పలువురు ట్రాక్టర్లు, పొక్లెయిన్‌ల యజమానులు గ్రావెల్ రవాణా చేస్తూ ప్రభుత్వ ఆదాయానికి గండికొడుతున్నారు. పొగిరి చుట్టు పక్కల సాగునీటి చెరువులు, కంకర దిబ్బల నుంచి గ్రావెల్ సేకరించి రాజాం పట్టణంలోని పలు నిర్మాణాలకు విక్రయిస్తున్నారు. ఒక్కో ట్రాక్టర్ గ్రావెల్ ధర రూ.800లు దాటి పలుకుతుండడంతో ఈ దందా అధికంగా జరుగుతోంది. ప్రభుత్వభూములు, సాగునీటి వనరుల్లో కంకర గ్రావెల్ మాయమవుతుండడంతో ఆయా గ్రామాల్లోని చెరువుల ఆయకట్టు రైతులు, ప్రజలు ఆందోళన చెందుతున్నారు. గ్రావెల్ అక్రమ రవాణాను నిలువరించాలని కోరుతున్నారు. పొగిరి గ్రామం నుంచి ఈ అక్రమ రవాణా అధికంగా ఉందని, అధికారులు చర్యలు చేపట్టాలని పొగిరి గ్రామస్తులు అధికారులను డిమాండ్ చేస్తున్నారు. ఈ గ్రావెల్ అక్రమరవాణాపై రాజాం తహసీల్దార్ రాజశేఖరం వద్ద సాక్షి ప్రస్తావించగా గ్రావెల్ అక్రమ రవాణాపై దృష్టిసారిస్తామని వెల్లడించారు. అనుమతులు లేకుండా గ్రావెల్ తవ్వకాలు జరిపితే తమ కార్యాలయానికి, సంబంధిత వీఆర్‌ఓకు ఫిర్యాదుచేయాలని సూచించారు. పొగిరి గ్రామ పరిసర ప్రాంతాల్లోని గ్రావెల్ రవాణాపై చర్యలు చేపడతామని స్పష్టం చేశారు.

గో హంతకులను శిక్షించాలి

గుర్ల: మండలంలోని గూడెం గ్రామ శివారులోని టేకు తోటలో గోవులను నిర్బంధిస్తున్న నిందితులను కఠినంగా శిక్షించాలని రాష్ట్ర గో సంరక్షణ సమాఖ్య అధ్యక్షుడు లోగిశ రామకృష్ణ, బీజేపీ మహిళా నేత పాక నాగమల్లిక రాణి డిమాండ్ చేశారు. గూడెం, గుజ్జంగివలసలో నిర్బంధంలో ఉన్న గోవులను వారు బుధవారం పరిశీలించారు. గోవులకు మేత వేసి, పరిస్థితిని పోలీసులకు వివరించారు.

పనుల పరిశీలన

చీపురుపల్లి: పట్టణంలోని రైల్వేస్టేషన్‌లో జరుగుతున్న అభివృద్ధి పనులను రైల్వే అధికారుల బృందం బుధవారం పరిశీలించింది. అమృత్ భారత్ పథకం నిధులతో స్థానిక రైల్వేస్టేషన్‌లో కొంత కాలంగా పనులు చేపడుతున్న విషయం తెలిసిందే. ఈక్రమంలో సీనియర్ డీసీఎం కె.పవన్‌కుమార్, డీఎస్‌టీఈ విజయ్ సైనీ, డీఈఈ అశోక్‌కుమార్, ఏఈఎన్ గౌరీనాయుడు, తదితరులు పనులు పరిశీలించి కాంట్రాక్టర్, సిబ్బందికి పలు సూచనలు చేశారు. పనుల్లో నాణ్యతా ప్రమాణాలు పాటించాలని సూచించారు. కార్యక్రమంలో రైల్వేస్టేషన్ కన్సల్టేటివ్ కమిటీ మెంబర్ ఇప్పిలి నీలకంఠం పాల్గొన్నారు.